తమిళ కాంగ్రెస్ దిగ్గజం కుమరి అనంతన్ కన్నుమూత



● ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాంధేయవాది, రాష్ట్ర కాంగ్రెస్ దిగ్గజం, సాహితీ వేత్త, మాజీ ముఖ్యమంత్రి దివంగత కామరాజర్ ప్రియశిష్యుడు, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తండ్రి కుమరిఅనంతన్ కన్నుమూశారు. ఆయన వయస్సు 93 సంవత్సరాలు. గత కొన్నేళ్లుగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్న కుమరి అనంతన్... శ్వాసకోశ, మూత్రాశయ సమస్యలు రావటంతో చికిత్స నిమిత్తం ఆయన్ని స్థానిక వానగరంలో ఉన్న అపోలో ఆస్పత్రిలో చేర్చారు. బుధవారం వేకువజాము 12.15 గంటలకు చికిత్స ఫలించక ఆయన తుదిశ్వాస విడిచారు. దీంతో ఆయన పార్థివదేహాన్ని సాలిగ్రామంలోని తమిళిసై సౌందరరాజన్ నివాసగృహంలో ప్రజల సందర్శన కోసం ఉంచారు.

ఆ పేరు వెనుక...

కుమరి అనంతన్ కన్నియాకుమారి జిల్లా అగస్తీశ్వరంలో స్వాతంత్ర్య సమరయోధుడు హరికృష్ణన్, తంగమ్మాళ్ దంపతులకు 1933 మార్చి 19న జన్మించారు. ఆయన అసలు పేరు అనంత కృష్ణన్. కన్నియాకుమారి జిల్లాకు చెందిన నాయకుడు కావటంతో అందరూ ఆయన్ని కుమరి అనంతన్ అంటూ పిలిచేవారు. ఆ పేరే ఆయనకు శాశ్వత నామధేయంగా మారింది. తమిళసాహిత్యంలో యూజీ, పీజీ చేసిన కుమరి అనంతన్ బాల్యం నుంచే తమిళ మహాకవి భారతియార్ అంటే ఎంతో ఇష్టం. ఆ మహాకవి జీవిత విశేషాలు, సాహిత్య రచనలపై సమగ్రంగా అధ్యయనం చేశారు. విద్యార్థి దశ నుండే కాంగ్రెస్ వీరాభిమానిగా ఉండేవారు. యుక్తవయస్సులో కృష్ణకుమారిని వివాహం చేసుకున్నారు. ఈయనకు తమిళిసై సౌందరరాజన్‌తో పాటు నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. 1965లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆ తర్వాత రాష్ట్ర కాంగ్రెస్‌లో కీలక పాత్ర పోషిస్తూ వచ్చిన కుమరిఅనంతన్ 1977లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నాగర్‌కోవిల్‌లో పోటీ చేసి గెలిచారు. లోక్‌సభలో తమిళంలో ప్రశ్నలడిగే హక్కును పొందిన సభ్యుడిగా పేరుగడించారు. శాసనసభల్లో, లోక్‌సభలో భారతీయ భాషలన్నింటికీ ప్రాధాన్యం ఇవ్వాలని పట్టుబట్టారు. లోక్‌సభ, రాజ్యసభలో తమిళం సహా ఇతర భాషల్లో సభ్యులు ప్రశ్నలడిగితే అప్పటికప్పుడు హిందీ, ఆంగ్ల భాషల్లో తర్జుమా చేసే పరికరాలు ఏర్పాటు కావడానికి ప్రధాన కారకుడు కుమరి అనంతనే. రాష్ట్ర విమానాశ్రయాల్లో తమిళంలో ప్రకటనల సదుపాయాన్ని సాధించిన నేతగానూ కుమరి అనంతన్ పేరుగడించారు. ఇక సాత్తాన్‌కుళం, రాధాపురం, తిరువొత్తియూరు శాసనసభ నియోజకవర్గాల్లో పోటీ చేసి గెలిచారు. కొన్నేళ్ల కాంగ్రెస్ నుంచి విడిపోయి 'గాంధీ కామరాజ్ దేశియ కాంగ్రెస్' పేరుతో సొంతపార్టీని ప్రారంభించి చేతులు కాల్చుకున్నారు. అటు పిమ్మట సంపూర్ణ మద్యనిషేధం కోసం పాదయాత్ర, నిరాహార దీక్షలు తదితర ఆందోళనలు కూడా జరిపారు.

తమిళ సాహితీవేత్తగా...

కుమరి అనంతన్ తమిళ సాహితీవేత్తగాను కీర్తిగడించారు. తమిళ ప్రాచీన సాహిత్యాలన్నింటినీ ఔపోసన పట్టిన కాంగ్రెస్ నేతగా పేరు తెచ్చుకున్నారు. తమిళ మహాకవి భారతియార్ కవితలు, రచనలపై సమగ్ర అధ్యయనం చేసి సభలు, సదస్సులలో ఆ మహాకవి సాహిత్య రచనలపై అనర్గళంగా ప్రసంగించేవారు. 'కలిత్తొగై ఇన్బమ్', 'పడిత్తేన్ కొడుత్తేన్', 'నల్లాచ్చి తంద నాయగన్ కామరాజ్' అనే రచనలు కూడా చేశారు. గంగా, కావేరి నదుల అనుసంధానం కోసం ఆందోళనలు జరపడం, పాప్పారపట్టిలో భరతమాతకు విగ్రహం, మణియాచ్చి రైల్వేస్టేషన్‌కు వాంఛినాథన్ పేరు, వా.వు. చిదంబరం కోయంబత్తూరు జైలులలో ఉపయోగించిన గానుగ యంత్రాన్ని చెన్నైకి తెప్పించడం, కామరాజర్ స్మారక మండపంలో ఆరని జ్యోతి ఏర్పాటు చేయడం... కుమరి అనంతన్ చేసిన కార్యక్రమాలు పలువర్గాల ప్రశంసలందుకున్నాయి. హిందీ ప్రసంగాలను తమిళంలో తర్జుమా చేయడంలో కుమరి అనంతన్ దిట్ట. అప్పటి ప్రధానమంత్రులు మొరార్జీ దేశాయ్, రాజీవ్‌గాంధీ, పీవీ నరసింహారావు రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడు వారి ప్రసంగాలను చక్కటి తమిళంలో అనువాదం చేసి వారి ప్రశంసలు కూడా అందుకున్నారు.

తగసాలై తమిళర్ అవార్డు గ్రహీత..

కుమరి అనంతన్ తమిళ సాహిత్యానికి చేసిన కృషిని గుర్తించి గత యేడాది రాష్ట్ర ప్రభుత్వం ఆయనను తగసాలై తమిళర్ అవార్డుకు ఎంపిక చేసింది. గత ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ ఆ అవార్డును కుమరి అనంతన్‌కు ప్రదానం చేశారు.

అంత్యక్రియలు...

కుమరి అనంతన్ అంత్యక్రియలు కాంగ్రెస్ సీనియర్ నేతలు, స్నేహితులు, కుటుంబీకుల అశ్రునయనాల నడుమ బుధవారం సాయంత్రం జరిగాయి. ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాల మేరకు విరుగంబాక్కంలోని శ్మశానవాటికలో ఆయన పార్థివదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. సాలిగ్రామం నుంచి కుమరి అనంతన్ పార్థివదేహం ఉన్న శకటాన్ని పూలతో అలంకరించి ఊరేగింపుగా విరుగంబాక్కం శ్మశానవాటికకు తీసుకెళ్లారు. ప్రత్యేక పోలీసు దళం సభ్యులు తుపాకులు ఎక్కుపెట్టి గాలిలో కాల్పులు జరపటంతో కుమారి అనంతన్ కుమారుడు గీతన్ అంత్యక్రియలు నిర్వహించారు.

మండుటెండైతే మాకేం..?!

... మెరీనాబీచ్‌లో మువ్వన్నెల రెపరెపల మాటున కపోతాల కువకువలు



జాతీయ పారా పోటీల విజేతలకు ప్రోత్సాహకాలు



సైక్లింగ్ క్రీడాకారులకు అధునాతన సైకిల్ అందిస్తున్న ఉదయనిధి

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల జరిగిన 2వ 'ఖేలో ఇండియా' పారా క్రీడాపోటీల్లో రాష్ట్రానికి చెందిన 62 మంది క్రీడాకారులు పాల్గొని 74 పతకాలు కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఆ పతకాలు సాధించిన క్రీడాకారులను రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల తరఫున ఉపముఖ్యమంత్రి ఉదయనిధి అభినందించారు. బుధవారం పెరియమెట్‌లోని నెహ్రూ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఉదయనిధి పాల్గొని, పతకాలు సాధించిన క్రీడాకారులకు రూ.1.12 కోట్ల ప్రోత్సాహక నిధిని అందజేసి అభినందించారు. అలాగే, తమిళనాడు ఛాంపియన్స్ ట్రస్ట్ నిధుల నుంచి ఇండోనేసియాలో ఈ నెలలో జరగనున్న 'స్పీడ్ స్కేటింగ్ ఛాలెంజ్' పోటీల్లో పాల్గొననున్న దర్శనకు రూ.90 వేల చెక్కు, చైనాలో జరుగనున్న 'ఆసియన్ మౌంటైన్ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్' పోటీల్లో పాల్గొననున్న సైక్లింగ్ క్రీడాకారులు రమణి, సౌపర్ణికకు తలా రూ.50 వేల చెక్కులు అంజేశారు. అలాగే, వారికి రూ.7.4 లక్షల విలువైన అధునాతన సైకిళ్లను అందజేశారు. ఇక, అథ్లెట్ మారి ఆనంద్‌కు రూ.1.6 లక్షల విలువైన పోల్ వాల్ట్ పరికరాన్ని ఉప ముఖ్యమంత్రి అందజేశారు. కార్యక్రమంలో యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ అతుల్య మిశ్రా, ఎస్డీఏటీ సభ్యుల కార్యదర్శి జె.మేఘనాథ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎస్.రామచంద్రన్, డాక్టర్ అశోక్ శిఖామణి, పారా అథ్లెట్లు రమేష్ షణ్ముగం, కీర్తికా జయచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

ఒరగడంలో రూ.1000 కోట్లతో డిక్సన్ టెక్నాలజీ ఫ్యాక్టరీ

సీఎం సమక్షంలో కుదిరిన ఒప్పందం

5000 మందికి ఉపాధి



సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో కుదుర్చుకున్న అవగాహన ఒప్పంద పత్రాలను ప్రదర్శిస్తున్న డిక్సన్ సంస్థ చైర్మన్ సునీల్ వచాని తదితరులు

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా ఒరగడంలోని 'ఇండోస్పేస్ ఇండస్ట్రియల్ పార్కు'లో డిక్సన్ టెక్నాలజీస్ సంస్థ రూ.1000 కోట్లతో కొత్తగా ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ కర్మాగారాన్ని నెలకొల్పనుంది. ఈ మేరకు సచివాలయంలో పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక, వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సమక్షంలో డిక్సన్ సంస్థ ప్రతినిధులు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కర్మాగారం ద్వారా 5000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలుగుతాయని సీఎం స్టాలిన్ ప్రకటించారు. డిక్సన్ సంస్థ ఎలక్ట్రానిక్ వస్తువులు, లైట్లు, సెల్‌ఫోన్లకు అవసరమైన విడిభాగాలను ఉత్పత్తి చేసి సరఫరా చేస్తోందన్నారు. ఇందులో శామ్‌సంగ్, షామీ, మోటరోలా, బోట్, పానసోనిక్, టీసీఎల్ టెక్నాలజీస్, ఒన్ ప్లస్ వంటి సంస్థలు ఉన్నాయని తెలిపారు. ఈ సంస్థ ప్రస్తుతం కాంచీపురం జిల్లా ఒరగడంలోని ఇండోస్పేస్ ఇండస్ట్రియల్ పార్కులో ల్యాప్‌టాప్, ఆల్‌ఇన్ ఒన్ పీసీలు, ఎలక్ట్రానిక్ వస్తువుల ఉత్పత్తి సేవలందించడానికి వీలుగా ఓ కర్మాగారాన్ని నెలకొల్పబోతోందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్యశాఖ మంత్రి టీఆర్బీ రాజా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖ కార్యదర్శి వీఎన్ రాయ్, రాష్ట్ర పరిశ్రమల మార్గదర్శక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ధరేస్ అహమ్మద్, డిక్సన్ టెక్నాలజీస్ సంస్థ చైర్మన్ సునీల్ వచాని, వైస్‌చైర్మన్ పృథ్వీ వచాని, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సాయ్ పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కపాలేశ్వరాలయ రథోత్సవం



ఆర్కే మఠం రహదారిలో రథోత్సవం

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం మైలాపూరు కర్పగాంబాళ్ సమేత కపాలేశ్వరాలయంలో వార్షిక పంగుణి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం మహారథోత్సవం కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ తీర్థకొలను చుట్టూ ఉన్న మూడు ప్రధాన రహదారులు భక్తజనంతో నిండిపోయాయి. ఈ ఆలయంలో పంగుణి ఉత్సవాలు ఈ నెల 3న ప్రారంభమయ్యాయి. ఆ రోజు నుండి స్వామిఅమ్మవార్లు సూర్యప్రభ, చంద్రప్రభ, భూత, నాగ వాహనాల్లో ఆలయవీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ వేడుకల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం బుధవారం ఉదయం ప్రారంభమైంది. ఉదయం 6గంటలకు స్వామిఅమ్మవార్లు సర్వాలంకరణభూషితులై రథంపై ఆశీనులయ్యారు. ఆ తర్వాత భక్తులు రథానికి ఇరువైపులా నిలిచి మోకుతాళ్ళను పట్టుకుని లాగారా. తీర్థకొలను చుట్టూ ఉన్న ప్రధానమైన మూడు రహదారుల్లో రథోత్సవం సాగింది. ప్రధాన వీధుల్లో రథోత్సవం తర్వాత బుధవారం సాయంత్రం స్వామిఅమ్మవార్లు ఆలయ ప్రవేశం చేసి, మండపం వద్ద భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం ఉదయం 8 గంటలకు ఆలయంలో శైవ భక్త శిఖామణి తిరుజ్ఞాన సంబంధర్ స్వామి ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరగనున్నారు. సాయంత్రం 3.30 గంటలకు స్వామివారు 63 మంది నాయన్మార్లతో భక్తులకు దర్శనమిస్తారు. ఇక శుక్రవారం పంగుణి ఉత్తిరం పర్వదినం సందర్భంగా 'అరుపత్తుమూవర్ విళా' (63 మంది నాయన్మార్ల ఉత్సవం) అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఆ సందర్భంగా ఆలయం నుండి 63 మంది నాయన్మార్ల ఉత్సవమూర్తులను పల్లకీలలో ఊరేగించనున్నారు.

బెయిల్ నిబంధనలు ఉల్లంఘించలేదు

మంత్రి పదవిలో కొనసాగే హక్కుంది ● సుప్రీంకోర్టుకు మంత్రి సెంథిల్ బాలాజి వివరణ



ప్యారీస్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మనీ ల్యాండరింగ్ కేసులో న్యాయస్థానం తనకు మంజూరు చేసిన బెయిల్ నిబంధనలను ఉల్లంఘించలేదని, మంత్రి పదవిలో సాగే హక్కు తనకుందని రాష్ట్ర మంత్రి సెంథిల్ బాలాజి సుప్రీంకోర్టుకు వివరించారు. ఈ మేరకు ఆయన బుధవారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో రవాణా శాఖ మంత్రిగా వ్యవహరించిన సమయంలో ఆ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుంచి పెద్ద మొత్తంలో నగదు వసూలు చేశారని అందిన ఫిర్యాదుల ఆధారంగా సెంథిల్ బాలాజీని 2023 జూన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్టు చేశారు. దాదాపు 470 రోజులకు పైగా ఖైదీగా వున్న సెంథిల్ బాలాజి తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పలుమార్లు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు ఆయన ఖైదీగా ఉన్నందువల్ల ప్రస్తుత డీఎంకే మంత్రివర్గంలో శాఖలేని మంత్రిగా కొనసాగుతారని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించడం చర్చనీయాంశమైంది. బెయిల్ పొందేందుకు మంత్రి పదవి అడ్డుగా ఉందని భావించిన సెంథిల్ బాలాజి గత ఏడాది ఫిబ్రవరిలో పదవికి రాజీనామా చేశారు. సెంథిల్ బాలాజి బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు, 2024 సెప్టెంబరులో బెయిల్‌ను మంజూరు చేసింది. దీంతో ఆయన సెప్టెంబర్ 26న జైలు నుంచి విడుదలైన 3వ రోజున, అంటే 29న మళ్లీమంత్రిగా పదవీబాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో సెంథిల్ బాలాజి మళ్ళీ మంత్రిగా ఉన్నందువల్ల ఆయనకు సంబంధించిన మనీల్యాండరింగ్ కేసు విచారణ సక్రమంగా జరగడంలేదని, సాక్షులను బెదిరిస్తున్నారని, అందువల్ల ఆయన బెయిల్‌ను రద్దు చేయాలని విద్యాకుమార్ అనే వ్యక్తి గత ఏడాది నవంబరులో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటిషన్ పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అభయ్ ఎస్. ఒగా, ఆశ్విన్ జార్జ్‌లతో కూడిన ధర్మాసనం ఈ విచారణను 2025 ఏప్రిల్ 9వ తేదీకి వాయిదా వేస్తూ.. మంత్రిగా కొనసాగే హక్కుందా అని సెంథిల్ బాలాజీని ప్రశ్నించింది. దీనిపై సెంథిల్ బాలాజి సుప్రీంకోర్టుకు వివరణ ఇచ్చారు. తాను బెయిల్ నిబంధనలను ఉల్లంచినట్లు తానంటే గిట్టని వ్యక్తి దాఖలు చేసిన పిటిషనలో వాస్తవాలు లేవని, తాను మంత్రి హోదాలో కోర్టు ఉత్తర్వులను అతిక్రమించలేదని తన కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

సంగం సాహిత్యాన్ని మరవొద్దు

● రాష్ట్ర మంత్రి తంగం తెన్నరసు
● వీఐటీలో సాహితీవేత్తలకు పురస్కారాల ప్రదానం



పురస్కారగ్రహీలతో మంత్రి తంగం తెన్నరసు, వీఐటీ ఛాన్సలర్ విశ్వనాధన్ తదితరులు

పెరంబూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన తమిళానికి మూలకారకమైన సంగం సాహిత్యాన్ని మరువరాదని రాష్ట్ర ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు విజ్ఞప్తి చేశారు. స్థానిక 'వీఐటీ-చెన్నై' యూనివర్శిటీ ప్రాంగణంలోని వీవీ స్వామినాథ అయ్యర్ గ్రంథాలయం ఆధ్వర్యంలో బుధవారం తమిళ సాహితీ రంగంలో విశిష్ట సేవలందించిన పలువురికి పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమానికి వీఐటీ వర్శిటీ ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ అధ్యక్షత వహించగా, వర్శిటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం, సేక్కిలార్ పరిశోధన కేంద్రం అధ్యక్షుడు జస్టిస్ ఎస్.జగదీశన్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తంగం తెన్నరసు, వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ సంయుక్తంగా మహావిద్వాన్ శ్రీ మీనాక్షిసుందరం పిళ్లై పురస్కారాన్ని ధర్మపురి ఆధీనం ఆర్ట్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఎం.శివచంద్రన్‌కు, డాక్టర్ వి.వి. స్వామినాథ అయ్యర్ స్మారక పురస్కారాన్ని తంజావూరు తమిళ విశ్వవిద్యాలయ తమిళ సాహిత్య విభాగం మాజీ అధ్యక్షుడు కేవీ బాలసుబ్రమణ్యంలకు ప్రదానం చేశారు. తొలుత సంగం సాహిత్య సంపుటాన్ని ఛాన్సలర్ విశ్వనాథన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తంగం తెన్నరసు మాట్లాడుతూ... వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్ తమిళ సాహిత్యానికి ఎనలేని సేవలు చేస్తున్నారని, తన విశేష కృషి ద్వారా తమిళ సమాజాభివృద్ధికి పాటుపడుతున్నారని కొనియాడారు. పూర్వం తమిళ సాహిత్య గ్రంథాలను వాగుల్లో విసిరేసేవారని, అగ్నికి ఆహుతిచ్చేవారిని, అలాంటి ఘటనల ద్వారా పోయినవి పోగా, మిగిలినవే నేటి సాహిత్య గ్రంథాలని అన్నారు. ఈ కారణాల వల్లే తమిళ సాహిత్యంలో ఏదైనా విషయం గురించి చెబితే ఆధారాలున్నాయా అంటూ వెంటపడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం జరుపుతున్న పురావస్తు తవ్వకాల్లో ఒక్కో చోట ఒక్కో విధమైన ఆధారాలు లభిస్తున్నాయని, 'పురనానూరు'లో 'పాండియన్ నెడుంజెళియన్' అంటూ పేర్కొన్న పేర్లు మదురై సమీపంలో ఉన్న మాంగుళం తమిళ బ్రహ్మి లిపి శాసనాల్లో ఉన్నాయని తెలిపారు. ఈ విధంగా సంగం కాలపు పేర్లు మన శిలాశాసనాల్లోనే చూడగలమని తెలిపారు. తమిళ సాహిత్య భాష రూపాలే తరచూ మార్పులకు గురవుతున్న విషయాన్ని అందరూ గమనించాలన్నారు. భక్తిపూర్వక తమిళ రచనలు ఎక్కువగా వస్తున్నాయని, అవన్నీ సంగీత, సాహిత్యంగా చెలామణి అవుతున్నాయన్నారు. నేడు ఉన్న ఆంగ్ల పదాలతో చాలా వరకు సంకర భాషగా మార్పు చెందాయని మంత్రి తెలిపారు. విశ్వనాథన్ మాట్లాడుతూ... తమిళ గ్రంథాల్లో చివరి సంగం కాలపు రచనలు మాత్రమే లభించాయని, అవన్నీ తాళపత్రాల్లో రాసి ఉన్నాయని తెలిపారు. ప్రపంచంలోనే మొట్టమొదటి వ్యాకరణ గ్రంథం ఇటీవలే మనకు లభించిందని, సంగం కాల సాహిత్య గ్రంథాలు దేశమంతటా విస్తరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సమాచార దర్శిని

రేపటి నుంచి వారాంతపు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సెలవులను పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై నుంచి పలు ప్రాంతాలకు శుక్ర, శనివారాల్లో ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ పేర్కొంది. కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి శుక్రవారం తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోవై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర జిల్లాలకు 525 బస్సులు, శనివారం 380 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టినం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు శుక్ర, శనివారాల్లో తలా 50 బస్సులు, మాధవరం బస్ టెర్మినల్ నుంచి శుక్ర, శనివారాల్లో తలా 20 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. www.tnstc.in లో రిజర్వేషన్ చేసుకోవచ్చని ఎస్ఈటీసీ తెలిపింది.

19.62 లక్షల కొత్త రేషన్ కార్డుల పంపిణీ

పెరంబూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): డీఎంకే అధికారం చేపట్టిన అనంతరం 19.62 లక్షల కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు ఆహార శాఖ మంత్రి చక్రపాణి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నకిలీ చిరునామా సహా పలు కారణాలతో 6.11 లక్షల కార్డులు రద్దు చేసి, 27.75 లక్షల మంది పేర్లు తొలగించామన్నారు. అలాగే, 16.10 లక్షల ప్రాధాన్యేతర రేషన్ కార్డులను ప్రాధాన్య రేషన్‌కార్డులుగా మార్చామని తెలిపారు. ఒకే దేశం - ఒకే రేషన్ కార్డు పథకంలో పొరుగు రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చిన 15.78 లక్షల మంది లబ్ధిపొందుతున్నారని మంత్రి తెలిపారు.

29.46 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

పెరంబూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 29.46 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. రైతులు పండించే ధాన్యం కొనుగోలు చేసేలా రాష్ట్రవ్యాప్తంగా 3,393 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈ కేంద్రాల ద్వారా 3.83 లక్షల మంది రైతుల నుంచి 29.46 లక్షల టన్నుల ధాన్యం కొనుగులు చేసి, రూ.7,186 కోట్లు అందజేసినట్లు అధికారులు తెలిపారు.

మరుదమలై ఆలయానికి 14 వరకు నాలుగు చక్రాల వాహనాల నిషేధం

పెరంబూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మరుదమలై ఆలయానికి పర్యాటకుల నాలుగు చక్రాల వాహనాలను నిషేధించారు. కోవై సమీపంలోని మరుదుమలై సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కుంభాభిషేకం ఈనెల 4వ తేది ప్రారంభమైంది. ప్రతిరోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వామివారికి మండల పూజలు నిర్వహిస్తున్నారు. ఈ పూజలు 48 రోజులు జరగనున్నాయి. ఈ క్రమంలో, తమిళ ఉగాది, వారాంతపు సెలవుల కారణంగా భక్తులు అధికసంఖ్యలో ఉత్సవాలకు హాజరవుతున్నారు. వారి సౌకర్యార్థం ఈనెల 10 నుంచి ఈ నెల 14వ తేదీ వరకు కొండ మార్గంలో నాలుగు చక్రాల వాహనాలకు నిషేధించారు. ద్విచక్రవాహనాలు, మెట్ల మార్గం, ఆలయం తరపున నడుపుతున్న బస్సుల్లో భక్తులు వెళ్లి స్వామిని దర్శించుకోవాలని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

అసెంబ్లీకి ఐదు రోజుల సెలవు

పెరంబూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభకు ఈనెల 10నుంచి 14వ తేదీ వరకు సెలవు ప్రకటించారు. రాష్ట్ర శాసనసభ సమావేశాలు గత నెల 14న 2025-26 ఆర్థిక బడ్జెట్, 15న వ్యవసాయ బడ్జెట్ దాఖలు చేసిన విషయం విదితమే. అనంతరం 17 నుంచి 21వ తేది వరకు బడ్జెట్‌పై చర్చలు, వాటికి మంత్రుల సమాధానాలు ఇచ్చారు. అనంతరం 24వ తేది నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు వివిధ శాఖ పద్దులపై చర్చించారు.ఈనెల 9న బుధవారం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల శాఖ, కార్మికుల సంక్షేమం, వృత్తి నైపుణ్యాభివృద్ధి శాఖ పద్దుపై చర్చ జరిగింది.ఈనేపథ్యంలో,రాష్ట్ర శాసనసభ సమావేశాలకు ఐదు రోజులు సెలవు ప్రకటించారు. 10న గురువారం మహావీర్ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ సెలవు రోజు. 11వ తేది శాసనసభకు సెలవు ప్రకటించారు. 12,13 తేదీలు శని, ఆదివారాలు కావడంతో సమావేశాలు నిర్వహించరు. 14వ తేది తమిళ సంవత్సరాది, అంబేడ్కర్ జయంతిసందర్భంగా ప్రభుత్వ సెలవురోజు కావడంతో ఆ రోజు కూడా సమావేశాలకు సెలవు ప్రకటించారు. ఆ ప్రకారం, గురువారం నుంచి ఐదు రోజుల సెలవుల అనంతరం 15వ తేది శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఆ రోజున, వార్తలు, ప్రకటనలు, స్టేషనరీ, ప్రింటింగ్, తమిళ అభివృద్ధి, మానవ వనరుల నిర్వహణ విభాగాల పద్దులపై చర్చ జరుగనుందని అసెంబ్లీ వర్గాలు తెలిపాయి.

గిరి ప్రదక్షిణకు అనుకూల సమయం

పెరంబూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ అనుకూల సమయాన్ని ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. ప్రసిద్ధిచెందిన తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయానికి ప్రతిరోజు వేలాది మంది భక్తులు వచ్చి స్వామి దర్శించుకుంటారు. అలాగే, ప్రతినెలా పౌర్ణమి రోజున లక్షలాది మంది భక్తులు ఆలయ వెనుకపైపున్న అరుణాచలం కొండ చుట్టూ ఉన్న 14 కి.మీ గిరి ప్రదక్షిణ చేసి స్వామివారిని దర్శించుకుంటారు. ఈ నెల పౌర్ణమి గిరి ప్రదక్షిణ ఘడియలు 12వ తేదీ వేకువజామున 3.21 గంటలకు ప్రారంభమై 13వ తేదీ తెల్లవారుజామున 5.51 గంటల వరకు కొనసాగుతాయని ఆలయ నిర్వాహకులు ప్రకటించారు.

కోవై, నీలగిరి జిల్లాలకు వర్షసూచన

పెరంబూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కోవై, నీలగిరి, తేని, తెన్‌కాశి జిల్లాల్లోని ఒకట్రెండు ప్రాంతాల్లో రాబోయే 48 గంటల్లో భారీవర్షం కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. నైరుతి బంగాళాఖాతం, దాన్ని అనుకొని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మంగళవారం ఏర్పడిన అల్పపీడనం, రానున్న 12 గంటల్లో పశ్చిమ-మధ్య బంగాళాఖాతం మీదుగా ఉత్తరం వైపుకు పయనించి, తదుపరి 24 గంటల్లో ఉత్తర-ఈశాన్య దిశకు మారి, మధ్య బంగాళాఖాతం మీదుగా పయనించి క్రమంగా బలహీనపడనుంది. ఈ ప్రభావంతో కోవై, నీలగిరి, తేని, తెన్‌కాశి జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని, మిగిలిన జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 2-3 డిగ్రీల సెల్సియస్ పెరిగే అవకాశముందని తెలిపింది. చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం కొంత మేఘావృతంగా ఉంటూ, గరిష్ఠ ఉష్ణోగ్రత 37 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 28 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

వైభవంగా రంగనాథస్వామి రథోత్సవం



రథోత్సవంలో నిర్వాహకులు

ప్యారీస్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక షావుకారుపేట ముల్లావీధిలో ప్రసిద్ధి చెందిన పురాతన శ్రీరంగనాయకి అమ్మవారి సమేత రంగనాథస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ఈ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 1న ప్రారంభమై 12వ తేదీ వరకు కొనసాగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 7.30 గంటలకు ఆలయంలో ప్రత్యేక అలంకార దీపాది పూజలను వైష్ణవ సంప్రదాయలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అరటి, మామిడి తోరణాలు, పూలతో అందంగా అలంకరించిన రథంలో శ్రీరంగనాయకి అమ్మవారి సమేత రంగనాథస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. భక్తుల గోవిందనామస్మరణ, మేళతాళాల నడుమ షావుకారుపేట, కొండితోపు ప్రాంతాల్లోని వీధుల్లో రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జె.హరికుమార్, నిర్వహణ అధికారి పి.సంతోష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా మనవూరు కందసామి ఆలయ మహాకుంభాభిషేకం



కుంభాభిషేకం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

తిరుత్తణి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడు సమీపంలోని మనవూరులో ప్రసిద్ధి చెందిన కందసామి ఆలయ కుంభాభిషేకం బుధవారం ఉదయం వైభవంగా జరిగింది. బుధవారం తెల్లవారుజామున రాష్ట్రంలోని పలు జిల్లాల నుండే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, కేరళ తదితర రాష్ట్రాలనుండి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలోని ప్రధానమూర్తులైన శ్రీవళ్ళీ, దేవసేన సమత కందసామివార్లను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం శుభముహూర్తంలో పండితుల వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల హరోం హర దివ్యనామస్మరణల నడుమ అర్చకులు కలశాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్ళి ఆ పుణ్య జలాలతో ఆలయ గోపుర కలశాలపై కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

తిరుపతి - కాట్పాడి మధ్య డబ్లింగ్‌కు కేంద్రం ఆమోదం

పెరంబూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి - కాట్పాడి మధ్య 113 కి.మీ దూరానికి జంట రైలు మార్గం(డబ్లింగ్) ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ తెలిపారు. ఈ మేరకు కేంద్ర మంత్రి విడుదల చేసిన ప్రకటనలో... ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నామన్నారు. తిరుపతి - కాట్పాడి మధ్య 113 కి.మీ దూరం ప్రస్తుతం ఉన్న రైలు మార్గాన్ని రూ.1,332 కోట్లతో జంట రైలు మార్గాలుగా చేయాలని నిర్ణయించామన్నారు. దీతో ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రంలోని 400 గ్రామాలకు చెందిన సుమారు 14 లక్షల మంది లబ్ధిపొందనున్నారని పేర్కొన్నారు. అలాగే, జంట రైలు మార్గం ఏర్పాటుతో నేల బొగ్గు, వ్యవసాయ ఉత్పత్తులు, సిమెంటు తదితరాలు ఏడాదికి అదనంగా 40 లక్షల టన్నుల వరకు రవాణా చేసే అవకాశముంటుందని కేంద్ర మంత్రి తెలిపారు.

మహిళ, పిల్లల సంరక్షణ విభాగం సేవలు ప్రశంసనీయం

డాక్టర్ ఏవీ శివకుమారి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఏవీ శివకుమారి

పెరంబూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్త్రీ, పిల్లల సంరక్షణ పోలీసు విభాగం సేవలు ప్రశంసనీయమని ప్రముఖ సమాజ శ్రేయోభిలాషి డాక్టర్ ఏవీ శివకుమారి అన్నారు. ఈ విభాగం ఐజీ కయల్‌విళి నేతృత్వంలో పని చేస్తున్న 32 మందికి శివకుమార్ విందు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మహిళలపై జరుగుతున్న వేధింపులు, నేరాలు అడ్డుకొనేలా చేపట్టాల్సిన చర్యలు, అలాంటి వాటిపై ఫిర్యాదు చేయడం, మహిళా సంరక్షణకు అందుబాటులో ఉన్న చట్టాలు తదితరాలపై కయల్‌విళి తెలియజేశారు. డీఐజీ వెన్మతి, ఎస్పీ ఉమయాళ్ పాల్గొన్నారు.

ప్రజా గ్రీవెన్స్‌లో 26 వినతులు

పెరంబూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ గ్రీవెన్స్‌లో కమిషనర్ అరుణ్ పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి వారి సమస్యలు తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, బుధవారం 26 వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సమస్యలు విచారించి పరిష్కారం చూపాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులను కమిషనర్ ఆదేశించారు.

ఘనంగా మహావీర్ జయంతి వేడుకలు

ప్యారీస్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జైన మతస్థుల ఆరాధ్య దైవం మహావీర్ జయంతిని పురస్కరించుకుని చెన్నైలో బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జిటో), తమిళనాడు జైన్ మహామండల్, శ్రీజైన్ మహా సంఘాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ వేడుకల్లో ప్రముఖ సినీ తారలు జయప్రద, శ్రుతి హాసన్, రూపా గంగూలి, ఫణింద్రజిత్ సింగ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ శాంతి కోసం సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. జిటో చెన్నై నిర్వాహకులు రాజేష్ చందన్, పంకజ్ కన్కారియా, అరుణ్ అస్వాల్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సభాధ్యక్షులు చెన్నై జిటో ఛైర్మెన్ ప్రమోద్ చోర్డియా మాట్లాడుతూ... ఆధ్యాత్మిక విముక్తికి అహింస, సత్యం, నిజాయితీ తదితర సమాజం ఆరోగ్యకరంగా వుండాలని బోధించిన మహావీర్ చిరస్మరణీయుడిని కీర్తించించారు.

పాడైపోయిన గుడ్ల పంపిణీ



వేలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో కోడిగుడ్లను అందిస్తోంది. వారం రోజులనుంచి వేలూరులోని కన్నికాపురం, సెంబేడు తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పాడైపోయిన గుడ్లను పంపిణీ చేస్తున్నారు. మంగళవారం ఆ పాఠశాలలో పర్యటించిన తమిళగ వెట్రి కళగం నాయకులు శ్రీనివాసన్, ప్రశాంత్ ఈ విషయాన్ని గుర్తించి కలెక్టర్ సుబ్బులక్ష్మికి ఫిర్యాదు చేశారు. విచారణ జరపాల్సింగా పౌష్టికాహార శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దీంతో అధికారులు పాడైపోయిన గుడ్లను స్వాధీనం చేసుకున్నారు.

మండే ఎండల్లో 'రెయిన్ కోట్'

● మంత్రి చెళియన్ 'దూరదృష్టి'...!



పాల ఉత్పత్తిదారులకు రెయిన్‌కోట్ అందజేస్తున్న మంత్రి చెళియన్

పెరంబూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలానికి ఇంకా కొన్ని నెలలు ఉన్న తరుణంలో, ప్రస్తుతం మండుతున్న ఎండల్లో పాల వ్యాపారులకు మంత్రి కేవీ చెళియన్ రెయిన్ కోట్ అందించడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తంజావూరు జిల్లా తిరువిడై మరుదూర్ ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఉన్నత విద్యాశాఖ మంత్రి కేవీ చెళియన్ తన సొంత నిధులతో 130 మంది పాల వ్యాపారులకు రెయిన్ కోట్లు అందించారు. వర్షాకాలం ప్రారంభానికి ఇంకా పలు నెలలు ఉండడంతో, ఇప్పుడే మంత్రి రెయిన్ కోట్లు ఎందుకిచ్చారు? అంటూ ప్రజలు చర్చలు ప్రారంభించారు.'మంత్రి ఇలాంటి 'దూరదృష్టి'తో పథకాలు అమలు చేస్తూ, నియోజకవర్గం బాగుపడుంది కదా? అంటూ ప్రజలు ఛలోక్తులు విసురుతున్నారు.

ప్రయాణికులతో రామేశ్వరం రైల్వేస్టేషన్ కళకళ



రామేశ్వరం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు

పెరంబూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల అనంతరం రామేశ్వరం రైల్వేస్టేషన్ ప్రయాణికులతో కళకళలాడుతోంది. పాంబన్ సముద్రంలో 1914లో ఏర్పాటు చేసిన రైల్వే వంతెన మధ్యలో ఉన్న లిఫ్ట్‌పై 2022 డిసెంబరు 23న ఇనుప ప్లేట్ దెబ్బతినడంతో రామేశ్వరానికి రైళ్ల సేవలు నిలిపివేశారు. అనంతరం రూ.535 కోట్లతో కొత్తగా ఏర్పాటు చేసిన అధునాతన రైల్వే వంతెనను ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. దీంతో, రెండేళ్ల అనంతరం పాంబన్ రైల్వే వంతెన మీదుగా రామేశ్వరానికి ఎక్స్‌ప్రెస్ రైళ్లు చేరుకున్నాయి. దీంతో రైల్వేస్టేషన్ ప్రయాణికులతో కళకళలాడుతోంది.

మంత్రి నెహ్రూ సోదరుడిపై కొనసాగిన ఈడీ విచారణ



మంత్రి కేఎన్ నెహ్రూ సోదరుడు రవిచంద్రన్

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నగర పాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ సోదరుడు రవిచంద్రన్‌ను ఈడీ అధికారులు మూడో రోజు విచారించారు. నెహ్రూ కుటుంబీకులు టీవీహెచ్ పేరుతో నడుపుతున్న భవన నిర్మాణ సంస్థ, టీవీహెచ్ ఎనర్జీ రిసోర్సెస్ సంస్థల్లో కోట్లాది రూపాయల అక్రమ నగదు బట్వాడా జరిగినట్లు ఐటీ శాఖ నమోదు చేసిన కేసు విచారణ కొనసాగింపులో భాగంగా ఈడీ అధికారులు ఇటీవల చెన్నై సహా 13 చోట్ల తనిఖీలు నిర్వహించిన విషయం విదితమే. చెన్నైలోని రాజా అన్నామలైపురంలోని నెహ్రూ సోదరుడు రవిచంద్రన్ ఇంట్లో ఈనెల 7న ఉదయం నుంచి మంగళవారం సాయంత్రం వరకూ నిర్విరామంగా ఈడీ అధికారులు తనిఖీలు జరిపారు. ఆ తర్వాత ఉన్నట్టుండి రవిచంద్రన్‌ను అదుపులోకి తీసుకుని తమ వాహనంలో నుంగంబాక్కంలోని ఈడీ కార్యాలయానికి తరలించారు. దీంతో రవిచంద్రన్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసినట్లు వదంతులు వ్యాపించాయి. నాలుగు గంటలపాటు రవిచంద్రన్‌ను విచారించిన ఈడీ అధికారులు ఆయను తమ వాహనంలోనే వదిలారు. ఈక్రమంలో బుధవారం ఉదయం రవిచంద్రన్‌ను ఈడీ అధికారులు విచారించారు. ఈడీ అధికారులు అడిగిన సుమారు యాభైకి పైగా ప్రశ్నలకు రవిచంద్రన్ ఓపికగా సమాధానాలు ఇచ్చినట్టు సమాచారం.

మంగళదేవి కన్నగి ఆలయ అభివృద్ధికి చర్యలు

● అసెంబ్లీలో మంత్రి శేఖర్‌బాబు

ప్యారీస్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా వన్నాత్తిపారైలో శిథిలావస్థకు చేరుకున్న మంగళదేవి కన్నగి ఆలయ అభివృద్ధికి తగిన చర్యలు చేపట్టనున్నట్లు హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు పేర్కొన్నారు. అసెంబ్లీలో బుధవారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయంలో డీఎంకే సభ్యుడు కంబం రామకృష్ణన్ మాట్లాడుతూ, సుమారు 1800 సంవత్సరాల చరిత్ర కలిగి శిథిలావస్థకు చేరుకున్న మంగళదేవి కన్నగి ఆలయానికి మహాకుంభాభిషేకం నిర్వాహించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఆయనకు మంత్రి సమాధానం చెబుతూ, కేరళ-తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన తేని జిల్లాలో వివాదాస్పదమైన మంగళదేవి కన్నగి ఆలయానికి ప్రతినెలా రాష్ట్రానికి చెందిన భక్తులు సందర్శించేందుకు ప్రభుత్వం తరుపున చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ రాసిన లేఖకు కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ కూడా సానుకూలంగా స్పందించారని, రెండు రాష్ట్రాలకు చెందిన దేవాదాయ శాఖ అధికారులు త్వరలోనే సమావేశమై, మహా కుంభాభిషేకం నిర్వహణపై చర్చించి నిర్ణయం తీసుకుంటారని ఆయన తెలిపారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రధాన ఆలయాల్లో పనిచేస్తూ, మృతిచెందిన పర్మినెంట్ ఉద్యోగుల వారసులు 27మందికి కుటుంబ సంక్షేమ నిధిగా రూ.75లక్షలు అందజేసినట్లు మంత్రి శేఖర్‌బాబు తెలిపారు.

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరిస్తాం

● ప్రత్యేక గ్రీవెన్స్‌లో కలెక్టర్



గ్రీవెన్స్‌లో వినతిపత్రాలను అందుకుంటున్న కలెక్టర్

వేలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా పెర్నాంబట్ సమీపంలోని ఎరుకమ్‌బట్టిలో బుధవారం ఉదయం జరిగిన ప్రత్యేక గ్రీవెన్స్‌లో కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి పథకాల గురించి ఆమె ప్రజలకు వివరించారు. 115 మందికి రూ.45 లక్షల సహాయాలను అందించారు. అనంతరం 300 వినతిపత్రాలను స్వీకరించారు. ఆదిద్రావిడుల సంక్షేమ శాఖ అధికారి మధు చెరియన్, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ జయకుమార్, గుడిమయత్తం సబ్ కలెక్టర్ సుభలక్ష్మి, పంచాయతీ జాయింట్ డైరెక్టర్ తిరుపాల్ సహా పలు శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

తమిళంలోనే దుకాణాల నేమ్‌బోర్డులు



మాట్లాడుతున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లాలోని దుకాణాలపై తమిళంలోనే నేమ్‌బోర్డులు ఉండాలన్న ఆదేశాల మేరకు బుధవారం కలెక్టర్ సుబ్బులక్ష్మి ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అభిప్రాయాల్ని అడిగి తెలుసుకున్నారు. ఇందులో దుకాణాల వ్యాపారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వరదరాజన్ సహా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

12న రేషన్ గ్రీవెన్స్

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో 19 మండల కార్యాలయాల్లో ఈ నెల 12వ తేది రేషన్ గ్రీవెన్స్ జరుగనుంది. ఆహార పదార్థాల సరఫరా, వినియోగదారుల భద్రత శాఖకు చెందిన 19 మండల డిప్యూటీ కమిషనర్ కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ శిబిరాలు నిర్వహించనున్నారు. రేషన్ కార్డుల్లో పేర్లు చేర్పడం, తొలగింపు, చిరునామా, సెల్‌ఫోన్ నెంబర్లు మార్పు తదితరాలపై ఈ శిబిరాన్ని వినతిపత్రాలు సమర్పించవచ్చు. అలాగే, రేషన్ దుకాణాల్లో అందించే సరుకుల నాణ్యత, కొలతల్లో తేడాలు సహా ఇతర అంశాలపై ఫిర్యాదు చేయవచ్చని అధికారులు తెలిపారు.

తాంబరం ఫ్లైఓవర్‌పై గొయ్యి

ఆగిన వాహనాల రాకపోకలు

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తాంబరం సమీపంలో ఫ్లైఓవర్‌పై బుధవారం వేకువజామున ఆకస్మికంగా ఓ గొయ్యి ఏర్పడటంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తాంబరం వెస్ట్, ఈస్ట్ ప్రాంతాలను కలిపే చోట ఉన్న ఆ ఫ్లైఓవర్ మీదుగా ముడిచ్చూరు, పెరుంగళత్తూరు, పల్లావరం, వేళచ్చేరి చుట్టుపక్కలి ప్రాంతాలకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బుధవారం ఉదయం ఆ ఫ్లైఓవర్‌పై ఆకస్మికంగా సుమారు అడుగు లోతు గొయ్యి ఏర్పడింది. ఈ సమాచారం తెలియగానే ట్రాఫిక్ పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఆ తర్వాత సిమెంట్ మిశ్రమాన్ని తెప్పించి ఆ గొయ్యిని మూసివేశారు.ఆ తర్వాత ఆ ఫ్లైఓవర్‌పై వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

రాంగ్ నెంబర్‌కు కాల్...

ఇరువర్గాల ఘర్షణ ● ఐదుగురి అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నటుడు వడివేలు చేసిన కామెడీలా 'నీ అడ్రస్సు చెప్పు...వస్తాను' అంటూ ఇరువర్గాల ఘర్షణ పడిన వ్యవహారంలో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. తూత్తుకుడి జిల్లా కళుగుమలైకి చెందిన కమలేష్ (20) తిరునల్వేలిలోని సోలార్ కంపెనీలో పనిచేస్తున్నాడు. కమలేష్ గత సోమవారం తన స్నేహితుడికి ఫోన్ చేసిన సమయంలో, నెంబరు తప్పుగామారి కళుగుమలై ఆర్ముగం నగర్‌కు చెందిన కరుప్పుస్వామికి కాల్ వెళ్లింది. తన తప్పు గ్రహించిన కమలేష్ క్షమించాలని కరుప్పుస్వామిని కోరాడు. కొద్దిసేపటి తర్వాత కమలేష్ చేసిన కాల్ మళ్లీ కరుప్పుస్వామికి వెళ్లింది. ఈ విషయమై ఆగ్రహించిన కరుపుస్వామి మాటలతో కమలేష్ కూడా మాట్లాడడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఒకానొక సమయంలో కరుప్పుస్వామి 'నీ అడ్రస్ చెప్పరా... అక్కడకు వచ్చి తేల్చుకుంటాను' అని సవాలు విసరడంతో కమలేష్, తాను ఆర్ముగం నగర్ బస్టాండ్‌కు వస్తున్నా అంటూ ఫోన్ కట్ చేశాడు. దీంతో, కరుప్పుస్వామి తన స్నేహితులు మదన్‌కుమార్, మదన్‌కృష్ణన్‌కుమార్‌తో కలసి బస్టాండ్‌కు వెళ్లాడు. కొంతసేపటికి కమలేష్, తన అన్న మాదేష్, మరో బంధువుతో అక్కడికి చేరుకున్నాడు. ఇరువర్గాలు పరస్పరం దూషించుకుంటూ దాడులకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేసి, వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. ఇరువర్గాల ఫిర్యాదులపై కేసు నమోదు చేసిన పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.

పోలీస్ స్టేషన్ ముందు విషం తాగిన ఇద్దరు సోదరీమణులు

● ఒకరి మృతి



మేనక (ఫైల్ ఫొటో)

పెరంబూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్ ముందు విషం తాగిన ఇద్దరు సోదరీమణుల్లో ఒకరు మృతి చెందారు. తంజావూరు సమీపంలోని యువకుడిని ఓ కేసు విషయంపై విచారణకు నడుకావేరి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న యువకుడు సోదరీమణులు కీర్తన (28), మేనక (31) పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. తమ తమ్ముడు ఎలాంటి తప్పు చేయలేదని, విడిచిపెట్టాలని పోలీసులను బతిమిలాడారు. అందుకు పోలీసులు నిరాకరించినట్లు సమాచారం. పోలీసుల తీరును ఖండిస్తూ ఇద్దరు స్టేషన్ ముందు విషం తాగారు. ఊహించని పరిణామానికి దిగ్భ్రాంతి చెందిన పోలీసులు, వారిని వెంటనే తంజావూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సలు ఫలించక మేనక మృతిచెందగా, కీర్తన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

చెట్టిపాళయం పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ తనిఖీలు

పెరంబూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌లో లంచాలు తీసుకుంటున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో, కోవై చెట్టిపాళయం పోలీస్‌స్టేషన్‌లో అవినీతి నిరోధక శాఖ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. స్టేషన్‌కు ఫిర్యాదులు చేసేందుకు వస్తున్న వారు, పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుంచి రైటర్ రమేష్ లంచాలు ఆశిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో, బుధవారం మధ్యాహ్నం ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. రమేష్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు వైస్ ప్రిన్సిపాల్ అరెస్ట్



వేలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కటకటాల పాలయ్యాడు. వేలూరులోని ప్రైవేటు కళాశాలలో వైస్‌ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న అన్బలగన్... విద్యార్థినిపై గత రెండేళ్లుగా లైంగికంగా వేధిచేస్తు న్నాడని సమాచారం. ఈ క్రమంలో ఆ విద్యార్థినికి పెళ్లి నిశ్చయించారు. అయినప్పటికీ వైస్ ప్రిన్సిపాల్ ప్రతిరోజు తనకు ఫోన్‌చేసి వేధిస్తుండటంతో తన తల్లిదండ్రులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అతడిపై ఐదు సెక్షన్లతో కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న అన్బళగన్ పరారయ్యాడు. ఈ నేపథ్యంలో అతడు చిత్తూరులో ఉన్నాడన్న పక్కా సమాచారంతో చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చెందోలు సహకారంతో వేలూరు ఎస్పీ ఎస్.మదివానన్ నేతృత్వంలోని పోలీసులు నాలుగు బృందాలుగా వెళ్లి అతడిని గాలించి పట్టుకున్నారు. కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు.

బైక్ చోరీలకు పాల్పడుతున్న యువకుడి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితుడు

వేలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడి పరిసర ప్రాంతాల్లో బైక్ చోరీలకు పాల్పడుతున్న ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మూడేళ్ళుగా వేలూరు నగర శివార్లలో వరుస బైక్ చోరీలకు పాల్పడుతున్న కార్తిక్ అనే యువకుడిని జిల్లా ఎస్పీ ఎస్.మదివానన్ నేతృత్వంలోని పోలీసులు బుధవారం ఉదయం అరెస్టు చేశారు. విచారణలో తిరువళ్లూరు జిల్లా తిరునింద్రవూర్‌కు చెందిన కార్తిక్ తన మిత్రులతో కలిసి ద్విచక్ర వాహనాలను దొంగిలించి ఇతర రాష్ట్రాల్లో విక్రయిస్తున్నారు. ఈక్రమంలో యువకుడినుంచి 34 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, వేలూరు సెంట్రల్ జైలుకు తరలించారు.



కుమరి అనంతన్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి నివాళి



శాసనసభలో కుమరి అనంతన్ మృతికి సంతాప సూచకంగా మౌనం పాటిస్తున్న స్పీకర్ అప్పావు, సీఎం స్టాలిన్, మంత్రులు, శాసనసభ్యులు

కుమరి అనంతన్‌కు ప్రధాని మోదీ, స్టాలిన్, ఈపీఎస్ సహా నేతల నివాళి

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తమిళ కాంగ్రెస్ వృద్ధ నేత కుమరి అనంతన్ మృతికి ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. సాలిగ్రామంలో తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నివాసగృహంలో ప్రజల సందర్శన కోసం అద్దాలపేటికలో ఉంచిన కుమరి అనంతన్ పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్టాలిన్ విడుదల చేసిన ప్రకటనలో 'ఇలక్కియ సెల్వర్' (సాహిత్య పండితుడు), కాంగ్రెస్ వృద్ధనేత కుమరిఅనంతన్ మృతి వార్త తెలియగానే తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని పేర్కొన్నారు. ఆయన మృతి తమిళ సమాజానికి తీరని లోటు అని, పార్లమెంట్‌లో తమిళంలో మాట్లాడే హక్కును సాధించిన నేతగా కీర్తిగడించిన కుమరి అనంతన్‌కు గత యేడాది తన చేతులు మీదుగా 'తగసాల్ తమిళర్' అవార్డును అందజేశానని తెలిపారు. కుమరి అనంతన్ మృతితో శోకతప్తురాలైన సోదరి తమిళిసై ఇతర కుటుంబ సభ్యులందరికీ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నానని పేర్కొన్నారు.

కుమార్తె తమిళిసైకి సీఎం ఓదార్పు

సాలిగ్రామంలో ఉన్న కుమరి అనంతన్ పార్థివదేహం వద్ద ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులు సుబ్రమణ్యం, ఎంపీ కనిమొళి, డీఎంకే నేతలతో కలిసి నివాళులర్పించారు. తమిళిసై సౌందరరాజన్‌ను స్టాలిన్ ఓదార్చారు. స్టాలిన్ పరామర్శించగానే ఆమె భోరున విలపించారు. అదే సమయంలో ఆమె భర్త డాక్టర్ సౌందరరాజన్ కూడా కంట తడి పెట్టుకున్నారు. రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి కూడా కుమరి అనంతన్‌కు నివాళులర్పించారు. ఎండీఎంకే చీఫ్ వైగో, డీపీఐ అధినేత తిరుమావళవన్, సినీనటుడు శరత్‌కుమార్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, మాజీ ముఖ్యమంత్రి జయలలిత సన్నిహితురాలు శశికళ తదితరులు కుమరి అనంతన్‌కు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.



వైగో నివాళి

శాసనసభలో సంతాపం...

బుధవారం ఉదయం శాసనసభ సమావేశం ప్రారంభంలో కుమరిఅనంతన్ మృతికి సంతాప తీర్మానాన్ని స్పీకర్ అప్పావు ప్రతిపాదించారు. ఆ సందర్భంగా కుమరి అనంతన్ మృతికి సంతాపం ప్రకటించేలా ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులు, ఇతర శాసన సభ్యులందరూ రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు.







నివాళులర్పిస్తున్న డీఎంకే ఎంపీ కనిమొళి, డీపీఐ అధినేత తిరుమావళవన్, నటుడు శరత్‌కుమార్, మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామి, శశికళ

'ధనుష్-55' స్టోరీని లీక్ చేసిన దర్శకుడు!



ధనుష్ - రాజ్‌కుమార్ పెరియస్వామి

'అమరన్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ మూవీని అందించిన దర్శకుడు రాజ్‌కుమార్ పెరియస్వామి తన తదుపరి సినిమాను హీరో ధనుష్‌తో చేయనున్నారు. ఇది ధనుష్ నటించే 55వ చిత్రం. ప్రస్తుతం ధనుష్ హిందీ చిత్రంలో నటిస్తున్నారు. ఈ షూటింగ్ పూర్తైన తరువాత రాజ్‌కుమార్ దర్శకత్వంలో నటించనున్నారు. ఈ నేపథ్యంలో డైరెక్టర్ రాజ్‌కుమార్ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "ధనుష్-55' ప్రీప్రొడక్షన్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఐదారు నెలల్లో చిత్రీకరణ పనులు ప్రారంభించాలని భావిస్తున్నాం. ఇది దైనందిన జీవితంలో భాగమైన చాలా మంది వ్యక్తుల కథ. కానీ, ఇలాంటి వ్యక్తులు కూడా మనమధ్య ఉన్నారని ఎన్నడూ గ్రహించి ఉండం. మన సాధారణ జీవితాలు సాఫీగా సాగిపోవడానికి ఇలాంటి వ్యక్తులే కారణం. మన కళ్లకు కనిపించని, మన మధ్య ఇలాంటి వ్యక్తులు చాలా మంది ఉన్నారు. అలాంటి వారికి ఈ సినిమా ఒక కేరాఫ్‌గా ఉంటుంది' అని పేర్కొన్నారు. కాగా, ఈ చిత్రం గోపురం ఫిలిమ్స్ పతాకంపై నిర్మాత అన్బుచెళియన్ సమర్పణలో నిర్మితంకానుంది.

చిన్న చిత్రాల పరాజయానికి టిక్కెట్ ధరలే కారణం

● దర్శక, హీరో రంగరాజ్



'గట్స్' ఆడియో ఆవిష్కరణ వేడుక

చిన్నబడ్జెట్ చిత్రాలు పరాజయం పాలవడానికి థియేటర్లలో టిక్కెట్ ధరలే ప్రధాన కారణమని డెబ్యూ డైరెక్టర్, దర్శకుడు రంగరాజ్ అభిప్రాయపడ్డారు. స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గట్స్'. ఇతర పాత్రల్లో శ్రుతి నారాయణన్, శ్రీలేఖ, ఢిల్లీ గణేష్, సాయ్ దీనా తదితరులు నటించారు. మనోజ్ ఛాయాగ్రహణం అందించగా, జోస్ ఫ్రాంక్లిన్ సంగీతం సమకూర్చారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఓపీఆర్ ప్రొడక్షన్స్ నిర్మించింది. ఈ చిత్ర ఆడియో విడుదల వేడుక తాజాగా చెన్నైలో జరిగింది. ఇందులో దర్శకహీరో మాట్లాడుతూ.. 'సినిమాల్లో నటించాలని గత 25 యేళ్లుగా పోరాటం చేస్తున్నా. అవకాశం కోసం వెళ్లిన ప్రతి చోటా డబ్బు - డబ్బు అంటూ పీడించారు. చివరకు కొందరు స్నేహితుల ద్వారా ఆ కల నెరవేరింది. ఇడ్లీలు విక్రయించి జీవనం సాగించిన ఓ తల్లి బిడ్డ ఇప్పుడు మీ ముందు హీరోగా నిల్చున్నాడు. నాకు సినిమా, రాజకీయ నేపథ్యం లేదు. ఈ సినిమా విజయం సాధిస్తే వచ్చే లాభాల్లో 50 శాతం సినిమాల్లో కష్టపడేవారి సంక్షేమం కోసం ఖర్చు చేస్తాం. హీరో అజిత్ కోసం రూ.200 ఖర్చు చేస్తారు. నాకు ఎవరు ఖర్చు చేస్తారు. ఈ కారణంగానే ఎన్నో సినిమాలు ఫెయిలవుతున్నాయి. అందువల్ల సినిమా టిక్కెట్ ధరను తగ్గించాలని కోరుతున్నా. ప్రతి ఒక్కరి జీవితాల్లో ఒత్తిడి ఉంటుంది. దాన్ని తొలగించే ఏకైక సాధనం సినిమా. అన్ని వర్గాల వారికి, అన్ని రకాల మనుషుల బాధలను తొలగించి, వినోదంపంచే ఏకైక సాధనం సినిమా మాత్రమే. సినిమా టిక్కెట్ ధర రూ.50గా ఉండేలా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నా' అని పేర్కొన్నారు.

షూటింగ్ ముగియగానే స్వగ్రామానికి వెళ్లిపోతున్న హీరో!




శశికుమార్

సాధారణంగా హీరో హీరోయిన్లతో పాటు జూనియర్ ఆర్టిస్టులంతా నగరాల్లో ఉండేందుకు ఇష్టపడతారు. కానీ, నటుడు శశికుమార్ మాత్రం షూటింగ్ పూర్తి చేసుకుని స్వగ్రామానికి వెళ్లిపోతుంటారు. కోలీవుడ్‌లోని ప్రముఖ హీరోల్లో ఒకరిగా ఉన్న శశికుమార్... ఎక్కడ షూటింగ్ జరిగినా అది పూర్తి చేసుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండడం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇదే అంశంపై ఆయన స్పందిస్తూ, 'నేను ఒక మలయాళ చిత్రంలో నటించా. ఆ చిత్రంలో నటించిన వారంతా షూటింగ్ పూర్తి చేసుకుని సాయంత్రానికి తమ సొంతూళ్లకు వెళ్లిపోవడాన్ని చూసి ఆశ్చర్యపోయా. పైగా వారి ఊర్లలో వారు వ్యవసాయం చేసుకుంటున్నట్టు చెప్పారు. ఇది నాకు నచ్చింది. నేను కూడా ఎందుకు చెన్నైలో ఉండాలి. 'మన ఊరు, మన మట్టి' అయిన గ్రామంలోనే ఉండాలని నిర్ణయించుకున్నా. సినిమాను ఇంట్లోకి తీసుకెళ్లేది లేదు. ఇక్కడ చిత్రపరిశ్రమకు చెందిన ఏ ఒక్కరినీ కలిసేది లేదు. షూటింగ్ లేకుంటే ఒక సాధారణ గ్రామస్తుడిగా జీవిస్తున్నా. మా ఊర్లో ఎవరు నాతో సెల్ఫీలు, ఫొటోలు తీసుకునేందుకు పోటీపడటం లేదు. రోడ్డులో నడిచివెళుతుంటా. సైకిల్‌పై వెళ్తా. ఇంటి బయట వీధిలో నిల్చొంటా. మామా, మచ్చా అంటూ ఆప్యాయంగా పిలుస్తుంటారు. సినిమా శాశ్వతం కాదు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టే ఏ ఒక్కరూ శాశ్వతం కాదు. చిత్రపరిశ్రమకు చెందిన వ్యక్తిని అనే అహంభావం లేకుండా ఈ జీవితం హాయిగా సాగిపోతోంది. గ్రామస్తులు కూడా నన్ను ఇబ్బంది పెట్టకుండా ప్రశాంతంగా ఉండేలా చూస్తున్నారు' అని చెప్పుకొచ్చారు.

కార్తి లేకుండా ఆ సినిమా సీక్వెల్ లేదు

● సెల్వరాఘవన్



తమిళ చిత్రజ్యోతి

హీరో కార్తి లేకుండా 'ఆయిరత్తిల్ ఒరువన్' రెండో భాగాన్ని తెరకెక్కించలేమని ఆ చిత్ర దర్శకుడు సెల్వరాఘవన్ స్పష్టం చేశారు. కార్తి, ఆండ్రియా, రీమాసేన్ తదితరులు నటించిన మూవీ 'ఆయిరత్తిల్ ఒరువన్'. నిజానికి ఈ సినిమా విడుదలైనపుడు పెద్దగా ప్రేక్షకాదరణకు నోచుకోలేదు. కానీ, ఆ తర్వాత సినీ అభిమానులు ఈ మూవీని ఎంతగానో ఆదరించారు. దీంతో రెండో భాగంపై చర్చ మొదలైంది. దీనిపై సెల్వరాఘవన్ తాజాగా స్పందించారు. 'ఇపుడు 'ఆయిరత్తిల్ ఒరువన్'కు విశేష ఆదరణ లభించడం చూస్తుంటే ఏం చెప్పాలో కూడా తెలియడం లేదు. ఎక్కడికి వెళ్లినా ఈ చిత్రం రెండో భాగం ఉంటుందా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ధనుష్‌తో కలిసి మాట్లాడి ఓ నిర్ణయం తీసుకుంటామని చెప్పడం మేం చేసిన పెద్ద పొరపాటు. అదే సమయంలో కార్తి లేకుండా ఈ సినిమా ఉండదు. ఆ కాలం నాటి చోళులు, పాండ్య రాజుల ప్రపంచాన్ని కథలో చూపించాలంటే ఎంతో శ్రమతో కూడుకున్నపని, అందుకు తగిన నిర్మాత కావాలి. చిత్రీకరణ పూర్తి చేయాలంటే నటీనటుల తేదీలు ఒక యేడాదిపాటు కావాల్సి ఉంటుంది. ఈ సినిమా తీయాలన్న బలమైన కోరిక, ఆశ ప్రతి ఒక్కరిలో ఉంది. బడ్జెట్ కూడా తక్కువే అవుతుంది. ఎందుకంటే ఏఐ, వీఎఫ్ఎక్స్ వంటి టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. అందువల్ల ఈ మూవీని తెరకెక్కించడం కూడా సులభమే' అని పేర్కొన్నారు.

జబిల్ సంస్థ ప్రతినిధులతో చర్చలు



బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో రాష్ట్రంలో కొత్త కర్మాగారం ఏర్పాటుపై ప్రభుత్వ ప్రతినిధులతో జరిగిన చర్చల్లో పాల్గొన్న అమెరికాకు చెందిన జబిల్ సంస్థ ప్రతినిధులు

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని ఫ్లోరిడా ప్రావిన్స్ సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఉన్న జబిల్ ఐఎన్‌సీ మల్టీ నేషనల్ మానుఫాక్చరింగ్ కంపెనీ నిర్వాహకులు రాష్ట్రంలో కొత్త కర్మాగారం నెలకొల్పే దిశగా ప్రభుత్వ ప్రతినిధులతో బుధవారం ఉదయం చర్చలు జరిపారు. రాష్ట్ర పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సమక్షంలో ఈ చర్చలు కొనసాగాయి. జబిల్ సంస్థ సీఈఓ ఆండ్రూ ప్రీస్టిలీ, వైస్ ఛైర్మన్ దేబాషిష్ చౌదరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.మురుగానందం, మంత్రి టీఆర్బీ రాజా తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్కేపీడీలో సీతారాముల కల్యాణం



గరుడవాహనంపై ఉత్సవమూర్తులు

ప్యారీస్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్కేపీడీ)లో గురువారం సీతారాముల కల్యాణోత్సవం జరగనుంది. ఈ ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఈనెల6న ఆదివారం నుంచి వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజైన మంగళవారం రాత్రి సీతారామలక్ష్మణ, ఆంజనేయ స్వామివార్ల ఉత్సవమూర్తులన గరుడవాహనంపై కొలువుదీర్చి భక్తులను దర్శన భాగ్యం కల్పించారు. లలితా సహస్రనామ సభ్యుల గోష్ఠిగానం అలరించింది. ఈ నెల 17వ తేదీ వరకు నిర్వహించనున్న నవమి ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన సీతారాముల కల్యాణోత్సవం ఈనెల 10న గురువారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నారని ఎస్కేపీడీ ఛారిటీ ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

జేపీ నడ్డాతో నయినార్ నాగేంద్రన్ భేటీ

● నేడు అమిత్‌షాతో సమావేశం



చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ శాసనసభ్యుడు నయినార్ నాగేంద్రన్ ఆ పార్టీ జాతీయ నాయకుడు జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. గురువారం ఉదయం ఆయన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో భేటీ కానున్నారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఇటీవల ఢిల్లీ వెళ్ళి అమిత్‌షాతో భేటీ అయినప్పటి నుంచి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలైని పదవి నుండి తొలగించనున్నట్లు ఊహాగానాలు చెలరేగాయి. అదే సమయంలో బీజేపీ అధ్యక్ష పదవికి రేసులో తాను లేనని అన్నామలై ప్రకటన జారీ చేశారు. దీంతో ఏ సమయంలోనైనా రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడిని నియమించే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, శాసనసభ్యురాలు వానతి శ్రీనివాసన్, బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు నయినార్ నాగేంద్రన్ తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆ నేపథ్యంలోనే నాగేంద్రన్‌కు పార్టీ అధిష్ఠానం నుండి ఆకస్మిక పిలుపురావటంతో ఆగమేఘాలపై సోమవారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. గత రెండు రోజులుగా ఆయన ఢిల్లీలోనే బస చేస్తున్నారు. ఏయే ప్రాంతాలకు వెళ్లి ఏ నాయకులను కలుసుకున్నారనే వివరాలను వెల్లడించకుండా రహస్యంగా ఉంచుతున్నారు. మంగళవారం సాయంత్రం ఆయన బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలుసుకున్నారు. ఆ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులు గురించి, బీజేపీ రాష్ట్ర శాఖ పరిస్థితులు గురించి ఇరువురూ చర్చించినట్టు సమాచారం. ప్రస్తుతం నయినార్ నాగేంద్రన్ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలుసుకునే ప్రయత్నంలో ఉన్నారు. కశ్మీర్ పర్యటనలో ఉన్న అమిత్‌షా బుధవారం రాత్రి ఢిల్లీకి తిరిగి వస్తారని, గురువారం ఉదయం నాగేంద్రన్ ఆయనతో భేటీ అవుతారని చెబుతున్నారు.

పనగల్‌పార్క్ - కోడంబాక్కం మధ్య త్వరలో మెట్రో సొరంగ మార్గం పూర్తి



సొరంగం తవ్వేందుకు ఉపయోగిస్తున్న పెలికాన్ యంత్రం

టి.నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాజధానిలో టి.నగర్ పనగల్ పార్కు నుంచి కోడంబాక్కం వరకు మెట్రోరైలు సొరంగ మార్గం పనులు సెప్టెంబర్‌లో పూర్తవుతాయని మెట్రోరైల్వే సంస్థ అధికారులు తెలిపారు. రెండో దశ మెట్రో రైలు ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సొరంగం తవ్వకాలకు 'పెలికాన్', 'పీకాక్' అనే భారీ యంత్రాలను ఉపయోగిస్తున్నారు. మెరీనాబీచ్ లైట్ హౌస్ నుంచి పూందమల్లి బైపాస్ వరకు నిర్మిస్తున్న మెట్రోరైలు మార్గం అత్యంత కీలకమైందని తెలిపారు. ఈ మార్గంలో లైట్‌హౌస్ నుంచి కోడంబాక్కం ఫ్లైఓవర్ వరకు సొరంగ మార్గంలో, కోడంబాక్కం పవర్‌హౌస్ నుంచి పూందమల్లి బైపాస్ వరకు స్తంభాలపై రైలు మార్గం నిర్మిస్తున్నారు. 9 సొరంగ మార్గం మెట్రోరైల్వే స్టేషన్లు, స్తంభాలపై నిర్మించే రైలు మార్గంలో 18 రైల్వేస్టేషన్లు ఉంటాయని తెలిపారు పనగల్ పార్కు - కోడంబక్కం సొరంగమార్గంలో పెలికాన్ భారీ యంత్రం ఉపయోగించి భూ ఉపరితలం నుంచి 18 మీటర్ల లోతున తవ్వకాలు జరుగుతున్నాయని చెప్పారు. గత యేడాది జనవరి 31న ప్రారంభమైన ఈ పనులు సెప్టెంబర్ నాటికి పూర్తవుతాయని తెలిపారు. గత నెల పెలికాన్ యంత్రంతో జరిగిన తవ్వకాల పనులు 1.2 కి.మీ.ల దూరం వరకు అంటే కోడంబాక్కం రైల్వేస్టేషన్ వరకు పూర్తైనట్లు చెప్పారు. ప్రస్తుతం పీకాక్ యంత్రంతో సొరంగ మార్గం తవ్వేపనులు జరుగనున్నాయని చెప్పారు.



రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలకు బుధవారం కూడా నల్లచొక్కాలు ధరించి వచ్చిన అన్నాడీఎంకే సభ్యులు. తమను మాట్లాడేందుకు అనుమతివ్వని స్పీకర్ అప్పావు వైఖరిని నిరసిస్తూ ప్రతిపక్ష నేత పళనిస్వామి నేతృత్వంలో వాకౌట్ చేస్తున్న నాయకులు



చెన్నై సైదాపేట నియోజకవర్గం కత్తిపారా కూడలి వద్ద జరుగుతున్న వాననీటి కాల్వల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి ఎం సుబ్రమణ్యం

నీట్‌పై మీ కపటనాటకాలు ఆపండి

● సీఎం స్టాలిన్‌పై అన్నామలై ధ్వజం

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నీట్ మినహాయింపు తెప్పిస్తానంటూ విద్యార్థులను మోసపుచ్చుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ వ్యవహారంపై ఆడుతున్న కపటనాటకాలను కట్టిపెట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఓ ప్రకటన జారీ చేశారు. నీట్ అమల్లోకి వచ్చిన తర్వాతే రాష్ట్రంలో సామాన్య కుటుంబాలకు చెందిన విద్యార్థులు వైద్య కోర్సుల్లో చేరుతున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా నీట్‌ను అమలు చేసేలా సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు వెలువరించినప్పటికీ నీట్‌ను రద్దు చేయిస్తానంటూ ఆశచూపి విద్యార్థులను ముఖ్యమంత్రి అదే పనిగా మోసగిస్తుండటం గర్హనీయమన్నారు. టాస్మాక్ అవినీతిపై విచారణను అడ్డుకునేందుకు, కళ్లకురిచ్చి కల్తీసారా సంఘటనపై విచారణ జరగకుండా అడ్డుకోవడానికి సుప్రీంకోర్టుకు వెళుతున్న డీఎంకే ప్రభుత్వం నాలుగేళ్లుగా నీట్ రద్దుకోసం ఎందుకు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించలేదో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇకనైనా నీట్ మినహాయింపు పేరుతో శాసనసభలో తీర్మానాలు చేసి కేంద్రానికి పంపి చేతులు దులుపుకునే పద్ధతిని మానుకోవాలని స్టాలిన్‌కు హితవు పలికారు.

ఒంటిమిట్ట కోసం లడ్డూలు సిద్ధం



ఒంటిమిట్ట సీతారాముల కల్యాణానికి వచ్చే భక్తులకు అందించేందుకు తిరుమలలో శ్రీవారి లడ్డూలు సిద్ధం చేశారు. డిప్యూటీఈవో(జనరల్) శివప్రసాద్, ఏఈవో బాలరాజు ఆధ్వర్యంలో దాదాపు 300 మంది శ్రీవారిసేవకులు 70 వేల లడ్డూలను బుధవారం సిద్ధం చేశారు. 11న ఒంటిమిట్టలో జరిగే కల్యాణంలో పాల్గొనే భక్తులకు ఈ లడ్డూను ప్రసాదంగా అందజేయనున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారిసేవలో ప్రముఖులు



కొల్లు రవీంద్ర - ప్రజ్ఞానంద సరస్వతి

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మంత్రి కొల్లు రవీంద్ర, బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, పెను గొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్,దివ్వెల మాధురి, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ భక్తి వెంకటయ్య ఉన్నారు. దర్శనం అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. శ్రీరామనవమి సందర్భంగా ఒంటిమిట్టలో రాష్ట్ర కార్యక్రమంగా జరగాల్సిన కళ్యాణోత్సవాలను గత ఐదేళ్లు నామమాత్రంగా చేశారని విమర్శించారు. తిరిగి అత్యంత వైభవంగా రాములవారి కల్యాణోత్స వాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 9 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు,వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.93 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,201

తలనీలాలు సమర్పించినవారు: 21,040





నాడు



నేడు

1970లో శ్రీవారి వసంతోత్సవం- ప్రస్తుతం ఇలా..

శ్రీహరి సేవకు.. తరలిరాద తనే వసంతం

● తిరుమలలో నేటి నుంచి వసంతోత్సవం

తిరుమలేశునికి సేవకు వనమే తరలిరానుందా..వేసవి నుంచి ఉపశమనం కలిగించనుందా.. శ్రీవారి వసంతోత్సవాల్లో అలాంటి దివ్యానుభూతి కలిగించేందుకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. వసంతఋతువులో మలయప్పస్వామికి జరిగే ఈ వేడుకను ఉపశమనోత్సవం అని కూడా పిలుస్తుంటారు. క్రీ.శ 1360 నుంచీ ఈఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు శాసనాధారముంది. చైత్రశుద్ధ పౌర్ణమికి ముగిసేలా మూడురోజుల పాటు జరిగే వేడుకలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వనమే దిగివచ్చిందా..

ఏటా వసంతోత్సవాలకు ఆలయం వెనుకభాగంలోని వసంతమండపాన్ని విశేషంగా అలంకరిస్తారు. శేషాచల అడవులను తలపించేలా పక్షులు, జంతువులు, వృక్షాలు, చెట్లు, పువ్వుల ఆకృతులతో తీర్చి దిద్దుతారు. ఉత్సవమూర్తులను కొలువుదీర్చే మండపాన్ని దాదాపు 250 కేజీల వట్టివేరుతో అలంకరిస్తారు. 600 కేజీల సంప్రదాయ పుష్పాలు, 10వేల కట్‌ఫ్లవర్స్‌తో సుందరంగా రూపొందిస్తారు. పచ్చని చెట్లు, పుష్పాలతో పాటు పలు రకాల పక్షులు,జంతువుల ప్రతిమలతో వనమే శ్రీవారి సేవకు తరలివచ్చిందా అనిపించేలా ఏర్పాట్లు చేశారు.

స్నపనంతో కన్నులపండువగా

గురువారం ఉదయం ఉత్సవమూర్తులను మాడవీధుల్లో ఊరేగించి వసంత మండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ ఆస్థానాన్ని నిర్వహిస్తారు. మధ్యాహ్నం స్నపనతిరుమంజనాన్ని ప్రారంభిస్తారు. ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నవకలశాభిషేకం, రాజోపచారం నిర్వహిస్తారు. తర్వాత ఛత్ర చామర వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం చేపడతారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా స్నపనం చేపడతారు. వీటితో శంఖధార, చక్రధార, సహస్రధార, మహాకుంభాభిషేకాలను ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమజాతి పుష్పమాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరిస్తారు. సాయంత్రం స్వామి అమ్మవార్లు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటారు.

స్వర్ణరథంపై ఉత్సవర్ల అభయం

రెండవరోజు శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి స్వర్ణరథంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈఉత్సవంలో మహిళా ఉద్యోగులు, భక్తులు గోవిందనామస్మరణలు చేస్తూ రథాన్ని లాగుతారు. గంట పాటు మాడవీధుల్లో వైభవంగా ఈవేడుకను నిర్వహిస్తారు. యథావిధిగానే వసంతమండపానికి ఉత్సవమూర్తులను వేంచేపు చేస్తారు. వసంతోత్సవాన్ని నిర్వహిస్తారు.


యుగ పురుషుల దర్శనం

శనివారం శ్రీవారు సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి, రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులతో కలిసి దర్శనమిస్తారు. తొలుత స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకిస్తారు. ఒకేవేదికపై సమస్త మూలవరులను ఒకేసారి దర్శనం కల్పించే అపురూప ఘట్టం సాక్షాత్కరిస్తుంది. అందుకే మూడవరోజు ఉత్సవంలో పాల్గొనేందుకు భక్తులు మక్కువ చూపుతారు. వసంతోత్సవాలు ముగిశాక మూడు యుగాల మూర్తులను మాడవీధుల్లో ఊరేగిస్తారు. ఈమూడు రోజుల పాటు 'మేవా' అనే ప్రసాదాన్ని ప్రత్యేకంగా తయారు చేసి వితరణ చేయనున్నారు.

● నేడు ప్రపంచ హోమియో దినోత్సవం

రోగికి కాదు.. రోగానికి చికిత్స అనే సూత్రంగా హోమియో వైద్యానికి గుర్తింపు ఉంది. దుష్ప్రభావాలు లేకుండా దీర్ఘకాలిక వ్యాధులనైనా నయం చేయగల వైద్యప్రక్రియగా ప్రజలు విశ్వసిస్తారు. కొవిడ్ సమయంలో ఈ వైద్యానికి విశేష ఆదరణ లభించింది. తర్వాతా ఎక్కువమంది హోమియో వైపు మొగ్గు చూపుతున్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి



వ్యాధి మూలానికి మందు ఇదిగో

హోమియో వైద్య విధానానికి పెరుగుతున్న ఆదరణ

దీర్ఘకాలిక రోగాలకూ పరిష్కారం



మంగళంలో ప్రభుత్వ హోమియో వైద్యశాల

జిల్లాలో 11 ప్రభుత్వ హోమియో వైద్యశాలలు ఉన్నాయి. తిరుపతిలోని పాత ప్రసూతి ఆస్పత్రి భవనంలో కేంద్ర ప్రభుత్వ పరిధిలో హోమియో వైద్యశాల నడుస్తోంది. గతంలో రోజుకు సుమారు 4 వేల మంది వరకు వైద్యం పొందే వారు. ఇప్పుడు ఆ సంఖ్య రెట్టింపైంది. పెరుగుతున్న ఆదరణకు ఇదే నిదర్శనం. దీనిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా హోమియోకు ప్రాధాన్యమిస్తూ ఆ ఆస్పత్రుల రూపురేఖలను మారుస్తున్నాయి. ఇప్పటికే తిరుపతి రూరల్ పరిధిలో మంగళంలో పైలట్ ప్రాజెక్టు కింద ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పేరుతో ప్రభుత్వ హోమియో వైద్యశాలను ఏర్పాటు చేసింది.

దీర్ఘకాలిక వ్యాధులకు పరిష్కారం

దీర్ఘకాలిక వ్యాధులకు హోమియోలో చక్కటి పరిష్కారం లభిస్తుందని వైద్యులు చెబుతున్నారు. మందుల ఖరీదూ తక్కువే. జలుబు, దగ్గు నుంచి మైగ్రేన్ తలనొప్పి, మహిళల్లో వచ్చే రుతుక్రమ రుగ్మతలకు, ఆర్థరైటిస్, వెన్నునొప్పి, చర్మ, శ్వాసకోశ వ్యాధులకు, దీర్ఘకాలిక అలసట, హార్మోన్లలో వ్యత్యాసం, జీర్ణ రుగ్మతలకు, అలర్జీలకు హోమియోకు మించిన వైద్యం లేదని రోగులు చెబుతుంటారు. హోమియో మందు ఒకసారి శరీరంలోకి ప్రవేశిస్తే ఎక్కువ కాలం ప్రభావం ఉంటుంది. వ్యాధి పునరావృతం కాదని వైద్యులు భరోసా ఇస్తున్నారు. సహజ సిద్ధమైన పదార్థాలతో చేసిన మందులు కావడంతో చెడు ప్రభావాలు ఉండవు.

సురక్షితమైన వైద్యం



హోమియోను మించిన సురక్షితమైన వైద్యం ఇంకొకటి లేదు. మందులు ఆలస్యంగా పనిచేస్తాయనేది అపోహ మాత్రమే. వైద్యులు సూచించిన విధంగా వాడితే ఎంతటి వ్యాధికైనా శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ప్రధానంగా మహిళల్లో వచ్చే నెలసరి సమస్యల నుంచి దీర్ఘకాలిక వ్యాధుల వరకు నివారణ మార్గముంది. హోమియో వైద్యానికి అలవాటు పడితే ఇక ఏ వైద్యప్రక్రియనూ ఇష్టపడరు.

- డాక్టర్ ఎం.ఎస్.ప్రసన్న లక్ష్మి, సీనియర్ మెడికల్ ఆఫీసర్, హోమియో వైద్యశాల, మంగళం




తిరుపతిలో సప్తగిరి తల్లి అంత్యక్రియలు

తిరుపతిరూరల్, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): సినీనటుడు సప్తగిరి తల్లి చిట్టెమ్మ అంత్యక్రియలు బుధవారం తిరుపతిలోని గోవిందధామంలో నిర్వహించారు. తిరుపతి రూరల్‌మండలం శ్రీనివాసపురం పంచాయతీ తిరుమలనగర్‌వీధిలోని నివాసం వద్ద ఆమె భౌతికకాయానికి పలువురు నివాళులర్పించారు. సప్తగిరిని పరామర్శించారు.

మహిళా అధికారిని వేధించిన కేసులో ఫారెస్ట్ రేంజర్‌కు మూడు నెలల జైలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఫారెస్ట్ ఫారెస్ట్ అధికారిని వేధించిన కేసులో రేంజర్‌కు సూళ్లూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి ఎస్.అనిల్‌కుమార్ మూడు నెలల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... 2023లో దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల కేంద్రంలో ఫారెస్ట్ బీట్ అధికారిగా పనిచేస్తున్న ఎస్‌కే అస్మ తుస్నీసాతో రేంజర్ బొద్దు వరప్రసాద్‌రావు అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా వేధింపులకు గురిచేశారు. దీనిపై బాధితురాలు దొరవారిసత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి సూళ్లూరుపేట కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. బుధవారం కేసు విచారించిన న్యాయమూర్తి అనిల్ కుమార్ నిందితుడు వరప్రసాదరావుకు మూడు నెలలు జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజే ప్రకృతికుమార్ కేసు వాదించారు.

పారదర్శకంగా భూసేకరణ



● జేసీ శుభం బన్సల్

సత్యవేడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో పారిశ్రామిక అభివృద్ధి కోసం చేపడుతున్న భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు జేసీ శుభం బన్సల్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో భూసేకరణ ప్రక్రియపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భూసేకరణలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇప్పటికే శ్రీసిటీ పరిధిలో ఏర్పాటు కానున్న ఎల్‌జీ పరిశ్రమకు 360 ఎకరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. దీనికి అవసరమైన 220 ఎకరాలను రైతులనుంచి సేకరిస్తుండగా, మిగిలిన భూములను శ్రీసిటీ నుంచి తీసుకున్నట్లు చెప్పారు. దీంతో పాటు మరో 2,580 ఎకరాలకు సంబంధించి భూసేకరణ కోసం ప్రభుత్వం గెజిట్ విడుదల చేసినట్లు తెలిపారు. త్వరలోనే ఈ ప్రక్రియకూడా ప్రారంభమవుతుందన్నారు. భూసేకరణపై గ్రామ సభలుకూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందించే విషయంలో ప్రభుత్వం తుది నిర్ణయం మేరకు ప్రకటించనున్నట్లు తెలిపారు. అనంతరం రికార్డుల గదిని పరిశీలించారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

నరసింగాపురంలో ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటన



అజయ్, నిఖిత (ఫైల్‌ఫొటో), శ్మశానం వద్ద పరిశీలిస్తున్న డీఎస్పీ తదితరులు

చంద్రగిరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నరసింగాపురానికి చెందిన నిఖిత(17) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పరువు హత్యగా సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న ఈ ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం మండలం నెత్తకుప్పం హరిజనవాడకు చెందిన అజయ్, నిఖిత కొద్దికాలంగా ప్రేమించుకుంటున్నారు. నరసింగపురానికి పొరుగున ఉన్న మిట్టపాలెం పంచాయతీ కొత్తూరు హరిజనవాడలోని తన అవ్వ ఇంటికి ఈ యువకుడు తరచూ వచ్చేవాడు. ఈక్రమంలో నిఖిత గర్భం దాల్చింది. ఈ విషయం తెలిసి నిఖిత తల్లి సుజాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. అజయ్‌పై పోలీసులు పోక్సో కేసు పెట్టి జైలుకు పంపించారు. జైలులో ఉన్న అజయ్‌ను చూసేందుకు తరచూ నిఖిత వెళ్లడం తెలిసి తల్లిదండ్రులు గట్టిగా మందలించారు. నెల క్రితం బెయిల్‌పై అజయ్ విడుదలయ్యాడు. అజయ్‌తో నిఖిత మళ్లీ మాట్లాడుతుండటంతో తల్లిదండ్రులు హెచ్చరించారు. ఈనేపథ్యంలో గత శుక్రవారం ఇంట్లో నిఖిత మృతి చెందింది. గంటల వ్యవధిలోనే ఈమె మృతదేహానికి దహనక్రియలు నిర్వహించారు. ఆమె మృతి ఆలస్యంగా వెలుగులోకి రావడంతో బుధవారం డీఎస్పీ ప్రసాద్, సీఐ సుబ్బరామిరెడ్డి సిబ్బంది నరసింగాపురం గ్రామానికి వెళ్లి మృతురాలి తల్లిదండ్రులను విచారించారు. దహనం చేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. దీనిపై సీఐను వివరణ కోరగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

ఆ మాటలేంటి జగన్?

● ఇకనైనా శవరాజకీయాలు మానుకో అన్న మంత్రి కొల్లు



తిరుపతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పోలీసులను బట్టలూడదీసి కొడతానని వైసీపీ అధినేత జగన్ బెదిరించడం చూస్తే అతనిపై క్రిమినల్ కేసు పెట్టాలని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అధికారులను భయపెట్టేలా మాటలేంటంటూ మండిపడ్డారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేసిన ఆయన.. ఇప్పుడు అదే పోలీసులు రక్షణగా వస్తే వారిని అవమానపరిచేలా మాట్లాడటం మంచిది కాదన్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తే జగన్ బయటకు వచ్చేఆరు కాదన్నారు. వైసీపీ హయాంలో ఏ చిన్న కార్యక్రమం చేయాలన్నా తమను హౌస్ అరెస్టులు చేసేవారని గుర్తుచేశారు. ఇప్పుడలా చేయడం లేదన్నారు. వైసీపీలో జరిగిన అక్రమాలపై లోతైన విచారణ జరుగుతోందని, అందుకే ఆలస్యం కావచ్చే మోగానీ ఎవరూ తప్పించుకోలేరన్నారు. కేసుల్లో ఉన్నవారు ముందుగానే బెయిల్‌కోసం ప్రయత్నిస్తున్నారంటే వారి ప్రమేయం ఉంటుందన్న అనుమానం కలుగుతోందన్నారు. అనంతపురం జిల్లాలో ఒక కుటుంబ తగాదాల్లో చనిపోయిన వ్యక్తిని శవ రాజకీయం చేశారని విమర్శించారు. ఇకనైనా శవ రాజకీయాలు మానుకోవాలని సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులు రాకూడదని కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే ఢిల్లీకి వెళ్లి ఏపీలో శాంతిభద్రతలు లేవని నానా యాగీ చేసిన జగన్.. ఇప్పుడు శవరాజకీయాలు ఎత్తుకున్నారని విమర్శించారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఏపీ రెండోస్థానంలో నిలవడం చంద్రబాబు పనితీరుకు నిదర్శనమన్నారు. వైసీపీ పాలనలో జీడీపీ పూర్తిగా పడిపోతే దానిని పెంచే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు నరసింహ యాదవ్, సుగుణమ్మ, శాప్ ఛైర్మన్ రవినాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, రుద్రకోటి సదాశివం, మహేష్ యాదవ్, మన్నెం శ్రీనివాసులు, కృష్ణ యాదవ్, శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



తమ వర్గం కౌన్సిలర్లతో ఎంపీ గురుమూర్తి, రాంకుమార్‌రెడ్డి తదితరులు

భానుప్రియపైనే విశ్వాసం

● మెజారిటీ కౌన్సిలర్ల మద్దతు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియపై మెజారిటీ కౌన్సిలర్లు విశ్వాసం ప్రకటించారు. వైసీపీకే చెందిన దొంతు శారద వర్గం 16 మంది కౌన్సిలర్లతో గత నెల 26వ తేదిన కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అవిశ్వాస తీర్మానంపై వినతిపత్రం అందించారు. ఈ క్రమంలో బుధవారం అవిశ్వాస తీర్మానంపై సమావేశం జరిగింది. ఈ మధ్యలో వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అసమ్మతి కౌన్సిలర్లను బుజ్జగించారు. మొత్తం 19 మందిని క్యాంప్‌కు తీసుకెళ్లినట్లు తెలిసింది. కాగా, 10.30 నుంచి 12గంటల మధ్య అవిశ్వాస తీర్మానంపై సమావేశాన్ని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ప్రొసీడింగ్ అధికారిగా నిర్వహించారు. 11గంటలకు 19 మంది కౌన్సిలర్లు నేరుగా మున్సిపల్ కార్యాలయంలోకి వచ్చారు. వీరు వైసీపీకే చెందిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియకు అనుకూలంగా మద్దతు తెలిపింది. కాగా, దొంతు శారద వర్గం సమావేశానికి రాలేదు. గూడూరు డీఎస్పీ గీతాకుమారి, వెంకటగిరి సీఐ ఏవీ రమణ, ఎస్‌ఐ సుబ్బారావు, ప్రత్యేక పోలీసు సిబ్బంది పటిష్టమైనా బందోబస్తు ఏర్పాటు చేశారు.

సరిహద్దుల్లో నిఘా పెంచండి

● అక్రమ మద్యం కట్టడి చేయాలన్న మంత్రి కొల్లు

● తిరుపతిపై ఫోకస్ పెంచాలన్న ఎక్సైజ్ ఉన్నతాధికారులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): 'ఉమ్మడి చిత్తూరు జిల్లాకు అటు కర్ణాటక, ఇటు తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులున్నాయి. ఇక్కడ నిఘా పెంచండి. గంజాయి, నాటుసారా, మాదక ద్రవ్యాలు రాకుండా పూర్తిగా కట్టడి చేయాలి' ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. తిరుపతిలో శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలోని సావేరి అతిథి గృహంలో బుధవారం జరిగిన ఎక్సైజ్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'తిరుపతిలో ఎక్కువగా విద్యాసంస్థలు ఉన్నందున ఇక్కడ ఎక్కువగా ఫోకస్ పెట్టాలి. మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిసలు కాకుండా చూడాలి' అని ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్లు నిషాంత్‌కుమార్, రాహుల్ దేవ్ శర్మ ఆదేశించారు. చిత్తూరు జిల్లాలో దాదాపు 70 సారా తయారీ కేంద్రాలను గుర్తించామని అక్కడ పూర్తిగా కనిపించకుండా చేయడానికి తీసుకుంటున్న చర్యలపై ఎక్సైజ్ డీసీ విజయశేఖర్ వివరించారు. అవి కూడా లేకుండా గట్టిగా పనిచేయాలని ఉన్నతాధికారులు సూచించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ డీసీ విజయశేఖర్, ఎక్సైజ్ ఈఎస్‌లు నాగమల్లేశ్వర రెడ్డి, శ్రీనివాసులు, డిస్టలరీ ఈఎస్ జానకిరాం, ఏఈఎస్ వాసుదేవ చౌదరి, ఊహశ్రీ, అన్ని జిల్లాల డీసీలు, ఈఎస్‌లు, ఏఈఎస్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.